# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలో ఈరోజు పర్యటిస్తారు.**

2. **శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణ శాఖ ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల జీతాలను 20 శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

4. **తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలో ఈ రోజు పర్యటిస్తారు. ఉదయం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన అనంతరం మధ్యాహ్నం అమరావతి నుంచి బయలుదేరి మార్కాపురం జిల్లా గంటావానిపాలెం చేరుకుంటారు. అక్కడ ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేసి, పనులను పరిశీలిస్తారు. అనంతరం తర్లుపాడు రోడ్డులో నిర్వహించే ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పి.రాజాబాబు కన పరిశీలించారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు అనంతరం ఇది ముఖ్యమంత్రి తొలి పర్యటన అని పి.రాజాబాబు తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణ శాఖ ఏర్పాటు చేసేందుకు నిర్ణయానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిన్న సమావేశమైన మంత్రి వర్గం మొత్తం 55 అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, శ్రీ సత్యసాయి జిల్లా, చీరాల, రాజమహేంద్రవరంలో పర్యాటక ప్రాజెక్టులకు, సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులు,. పెట్టుబడుల ప్రోత్సాహక మండలి నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. విశాఖలో 2,387 కోట్ల రూపాయలతో నిర్మించే సెమీకండక్టర్ పరిశ్రమకు, వివిధ సంస్థలకు భూకేటాయింపుల నిర్ణయాలను మంత్రి మండలి ఆమోదించింది. అలాగే రాష్ట్ర సరిహద్దుల ఖరారుపై కేంద్ర ప్రభుత్వానికి పంపే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

--------------------------

తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఈరోజు నుంచి ప్రథమ సంవత్సరం, రేపటి నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని ఇంటర్మీడియట్ విద్యా కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1495 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రెండు సంవత్సరాలకు కలిపి మొత్తం 9 లక్షల 97 వేల 75 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థుల రవాణాకు ఇబ్బందులు లేకుండా టీజీయస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈరోజు ఆంగ్ల పరీక్ష జరుగుతుంది.

---------------------------

మావోయిస్టు ముఖ్య నాయకులు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట నిన్న హైదరాబాద్ లో లొంగిపోయారు. ఈ మేరకు డీజీపీ శివధర్‌రెడ్డి పాత్రికేయుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. "గత రెండేళ్లలో మొత్తం 591 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు జన జీవన స్రవంతిలోకి వచ్చారని తెలిపారు అజ్ఞాతాన్ని వీడి జన జీవన స్రవంతిలోకి వస్తున్న మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు, పునరావాస ప్రయోజనాలు అందిస్తామని డిజీపీ వివరిస్తూ..

వాయిస్..25 సెకన్లు

---------------------------

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు –పీఏసీఎస్ ఉద్యోగుల జీతాలను 20 శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగిన ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే గ్రాట్యుటీని 2 లక్షల నుంచి 4 లక్షలకు పెంచామని, ప్రతి ఉద్యోగికి 5 లక్షల రూపాయలతో ఆరోగ్య బీమా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అమలు విధానాలను త్వరలో ప్రకటిస్తామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటన పాలను శీతలీకరించే యంత్రంలో ఉపయోగించే ఇథిలిన్ గ్లైకాల్ లీకేజీ వల్ల జరిగి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, కల్తీ పాల ఘటనలో ఇప్పటివరకు నలుగురు మరణించారని చెప్పారు. ప్రస్తుతం 15 మంది పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెబుతూ..

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఈరోజు పలు అంశాలపై చర్చ జరగనుంది. పౌరుగుసేవల ఉద్యోగులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, అనంతపురంలో టెక్స్‌టైల్ పార్క్, యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు సభలో ఈరోజు సమాధానాలు ఇవ్వనున్నారు. తర్వాత వివిధ శాఖలకు సంబంధించిన బడ్జెట్ డిమాండ్లు, నిధుల కేటాయింపులపై చర్చ చేపట్టనున్నారు. శాసనమండలిలో వ్యవసాయంపై ఈ రోజు లఘు చర్చ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో డయాలసిస్ కేంద్రాలు, అతిసార వ్యాధి వ్యాప్తి, జల్ జీవన్ మిషన్, భోగాపురం విమానాశ్రయం, నౌకాశ్రయాలు–ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం వంటి అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలివ్వనున్నారు.

---------------------------

తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడుని కోరారు. ఢిల్లీలోని పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యాలయంలో ఇరువురు మంత్రులు నిన్న సమావేశమై తెలంగాణలోని వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లి సహా ప్రతిపాదించిన వివిధ విమానాశ్రయాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం, ప్రస్తుతం వాటి స్థితిగతుల గురించి ఈ సందర్భంగా చర్చించారు. వరంగల్ విమానాశ్రయం కోసం ఇప్పటికే 953 ఎకరాల భూమి అందుబాటులోకి వచ్చినట్లు పౌరవిమానయానశాఖ అధికారులు కేంద్ర మంత్రులకు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో అతిసార ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయం నుంచి నిన్న జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో అందుతున్న వైద్యంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం నగరంలో రహదారి మరమ్మతు పనుల కారణంగా అతిసార వ్యాపించిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలహీనపడిందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణాలోనూ పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

అఖిల భారత పోలీస్ క్రీడా నియంత్రణ మండలి –న్యూఢిల్లీ ఆధర్యంలో, ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ నిర్వహించిన 2వ అఖిల భారత పోలీసు సౌత్ జోన్ టీ–20 క్రికెట్ టోర్నమెంట్ 2025 – 26 పోటీలు నిన్న ఘనంగా ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా మూలపాడులో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 10 జట్లు టీ–20 క్రికెట్ టోర్నమెంటులో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ లో పుదుచ్చేరి పోలీసు విజేతగా నిలిచింది.

=====================